www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 212, బుధవారం 2-9-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**మధ్యాహ్నం దాటితే.. మందులు కరువు!**




5లో..

**ఢిల్లీ నడిబొడ్డున కదంతొక్కిన భద్రాద్రి జిల్లా సిపిఐ శ్రేణులు**




3వ పేజీల్లో

# హస్తంలో హై టెన్షన్!

- తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారిన ఢిల్లీ పరిణామాలు
- మంత్రులంతా ఢిల్లీ బాట పట్టడంతో వేడెక్కిన రాజకీయాలు...
- నేతలు ,మంత్రులు, ముఖ్యమంత్రులు ఢిల్లీ బాట పట్టడం చరిత్రలో తొలి సారి..
- మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా...?
- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి బెడ్సూ ఖాయమైందా...!!



హైదరాబాద్

ఒక్కసారిగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు హస్తినా బాట పట్టడం తో ఢిల్లీలో ఇంకా ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయా అన్న గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఎక్కడ చూసినా చర్చనీయాంశంగా మారింది. మరికొంతమంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధిష్టానం ఉద్వాసన పలికి సీనియర్ నేతలకు అవకాశం కలగనిందని.. మరి కొంతమంది కొండ సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించలని యోచిస్తున్నారని వీరిని అందుకే ఢిల్లీకి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో కొందరు వెల్లడిస్తున్నారు. అందువల్లనే పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, బట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తోపాటు మంత్రి వర్గాన్ని సీనియర్ నేతలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఉన్న - మిగతా2లో



## భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

- రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ వీడియో సందేశం
- రాహుల్ గాంధీకి పరోక్ష చురకలు
- విపక్షాల అసత్య ప్రచారాలకు జీడీపీ లెక్కలే సమాధానమన్న మోదీ

## బీజేపీ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

- తెలంగాణలో బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్టులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది
- నల్గొండకు బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలను గృహ నిర్బంధంలో ఉంచడం అప్రజాస్వామికం
- ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుంది
- ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు

హైదరాబాద్

బీజేపీ కార్యకర్తల అరెస్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యం లో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుందని, కానీ తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, వైఫల్యాలను ప్రశ్నించినందుకు, జవాబుదారీతనం కోరినందుకు ప్రతిపక్ష నాయకులను నిర్బంధిస్తున్నారంటూ కేంద్ర మంత్రి మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి నల్గొండకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ బీజేపీ నాయకులను గృహ - మిగతా2లో





## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

- 5 కొత్త కేటగిరీలు.. అక్టోబర్ 1 నుంచి రూ.200 ఛార్జీ!
- ఎన్‌పీఎస్ పథకాలకు కొత్త వర్గీకరణ విధానం
- ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు
- అక్టోబర్ 1 నుంచి రూ.200 చేరిక ఛార్జీ
- రూ.50 చొప్పున నాలుగు విడతల్లో వసూలు

# థౌజండ్‌వాలా



- వెయ్యి కౌంట్ దాటిన రేవంత్!
- గాంధీభవన్‌లో సంబురం..
- అపోజిషన్‌లో గరంగరం
- తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది.
- కాంగ్రెస్ సంబరాలు నిర్వహిస్తుండగా, బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.
- ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది.

హైదరాబాద్

రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా పవర్‌ఫుల్ ట్రంప్‌కార్డ్ చేతిలో ఉంది. రాష్ట్రం విడిపోయేటప్పుడు పవర్లో ఉన్న పార్టీగా మరో మేజర్ ఎడ్వాంటేజ్ కూడా ఉంది. కానీ, కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి.. అపోజిషన్‌కే పరిమితమైంది. అందుకే, థర్డ్ టైమ్ జరిగిన పోరులో జనామోదం పొంది థంపింగ్ విక్టరీ కొట్టి, ఆ కిక్కును ఫుల్‌టుఫుల్ ఎంజాయ్ చేసింది తెలంగాణలో హస్తం పార్టీ. అందుకే, రేవంత్ పాలనకు వందరోజులు పూర్తయినప్పుడు, ఏడాది కంప్లీట్ ఐనప్పుడు పెద్దసైజు జాతరలా ఘనంగా జరిగాయి సెలబ్రేషన్స్. విమర్శలొచ్చినా వెనక్కు చూడకుండా ముందుకే ఉరికారు సీఎం రేవంత్‌రెడ్డి. కట్‌చేస్తే, ఇప్పుడు వెయ్యిరోజుల మైల్‌స్టోన్‌ని టచ్ చేశారు. - మిగతా2లో

## 'శుద్ధీకరణ' పేరుతో సామాజిక అవమానం




- ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్‌లతో రాజకీయ ప్రతీకారం
- ఖర్గే నిలిచిన వేదికను 'శుద్ధి' చేయడం దళిత ఆత్మగౌరవంపై దాడి
- అంటరానితనాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులా?.. ఇదెక్కడి న్యాయం?:
- ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్

దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్– బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు మధ్య, ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనానికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత - మిగతా2లో



## విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరణ

- కఠిన చర్యలు ఉండవు : జేపీ నడ్డా
- సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలకు సంబంధించిన కేసులపై కేంద్రం కీలక ప్రకటన
- దిల్లీలో నమోదైన అన్ని కేసులను వెనక్కి తీసుకుంటామని నడ్డా వెల్లడి

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేత..
- ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు రద్దు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం
- ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడి



# బీజేపీ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

-మొదటిపేజీ తరువాయి

నిర్బంధంలో ఉంచడం అత్యంత శోచనీయమని అన్నారు. కేవలం బాధితులను పరామర్శించడానికి వెళ్లినందుకే బీజేపీ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచాలా? వారిని ప్రజలను కలవకుండా అడ్డుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్షాల గొంతును అణచివేయడానికి పోలీసులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. నల్గొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడి జరిగినప్పుడు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నప్పుడు, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని కిషన్ రెడ్డి అన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన బీజేపీ నాయకులను అరెస్టు చేస్తూ, దాడులు చేసిన వారిని స్వేచ్ఛగా వదిలేయడం ఏం న్యాయమని విమర్శించారు.



తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. దాడులు ఎవరు చేశారో, బాధితులు ఎవరో, అధికారాన్ని ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో వారికి బాగా తెలుసని, తెలంగాణ తన చరిత్రలో ఎన్నో ప్రజా ఉద్యమాలకు సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం నిలబడిన ఈ గడ్డపై అక్రమ అరెస్టుల ద్వారా ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని తెలిపారు. బీజేపీ నాయకులను ఎన్నిసార్లు అరెస్టు చేసినా, నిర్బంధంలో ఉంచినా, ప్రజల కోసం మా పోరాటం ఆగదని, ప్రజలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం, అన్యాయాన్ని బహిర్గతం చేయడం, బాధితులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని అన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కేయగలమని ప్రభుత్వం భావిస్తే, అది తీవ్రంగా పొరబడుతున్నట్లే. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయాధికారులు ప్రజలే. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల హక్కులను కాపాడటానికి, బాధితులకు అండగా నిలబడటానికి బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ఎంతటి నిర్బంధం లేదా అణచివేత కూడా ప్రజల కోసం మా పోరాటాన్ని ఆపలేవు అంటూ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే ఇప్పుడు తొలగించినవే ఎక్కువ!

రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా రూపొందించిన ఓటర్ల తొలగింపు జాబితాలోని గణాంకాలను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో ప్రధానంగా మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో తొలగింపునకు గుర్తించిన (అనర్హులుగా భావించిన) వ్యక్తుల సంఖ్య 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వాస్తవంగా నమోదైన ఓట్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. గ్రేటర్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో చివరి అసెంబ్లీ ఎన్నికల సమయంలో 21,72,111 ఓట్లు పోల్ కాగా, ముసాయిదా తొలగింపు జాబితాలో 19,41,444 మంది వ్యక్తుల పేర్లను చేర్చారు.



**మలక్‌పేటలో ఇదీ పరిస్థితి**

2026 జూన్ నాటికి మలక్ పేటలో మొత్తం 3,30,191 మంది ఓటర్లు ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,31,354 ఓట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1,35,807 ఓట్లు నమోదైనప్పటికీ ఎన్నికల సంఘం ఇప్పుడు ఈ నియోజకవర్గానికి సంబంధించి ఏకంగా 1,47,799 పేర్లను తొలగింపు జాబితాలో చేర్చింది. అంటే సుమారు 44.76 శాతం మంది ఓటర్ల పేర్లు ఈ కేటగిరీలోకి చేరాయి.

యాకుత్?పురాలో గమనిస్తే : 3,74,948 మంది నమోదిత ఓటర్లు ఉన్న యాకుత్‌పురా నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,39,990 ఓట్లు, పార్లమెంట్ శాసన నియోజకవర్గ ఎన్నికల్లో 1,56,341 ఓట్లు పోలైనప్పటికీ 1,54,982 మంది ఓటర్ల పేర్లను తొలగింపు జాబితాలో చేర్చారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రతి పది మంది ఓటర్లలో నలుగురి కంటే ఎక్కువ మంది పేర్లు తొలగింపు జాబితాలో ఉండటం గమనార్హం.

ఓటింగ్ శాతంపై ప్రభావం చూపొచ్చు : గత ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య కంటే అధికంగా ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో లేనివారు, వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు, మరణించిన లేదా ఆచూకీ లేని ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లయితే, ఇది గత ఎన్నికల్లో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోల్చితే ఓటింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సాధారణంగా తక్కువ ఓటింగ్ శాతం నమోదయ్యే హైదరాబాద్ నియోజకవర్గాల్లోనే సర్? ద్వారా ఇలా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగింపులు కనిపిస్తున్నాయి. 2023లో తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాల జాబితాలో మలక్‌పేట్, యాకుత్‌పురా కూడా ఉన్నాయి.

**పేర్లు తొలగిపోయినట్లు తేల్చడం సరికాదు**

తొలగింపు ముసాయిదా జాబితాను సిద్ధం చేసేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) గైర్హాజరైన, నివాసం మార్చుకున్న లేదా మరణించిన ఓటర్లకు సంబంధించిన వాదనలు, అభ్యంతరాలను సేకరించడానికి ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేస్తున్నారు. అదే సమయంలో అధికారిక నోటీసులను కూడా జారీ చేస్తున్నారు. తొలగింపు ముసాయిదా జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరినీ తుది ఓటర్ల జాబితా నుంచి శాశ్వతంగా తొలగిపోయినట్లు ఇప్పుడే తేల్చడం తొందరపాటు అవుతుందని రాజకీయ నాయకులు వాదిస్తున్నారు. అయితే మలక్‌పేట్, యాకుత్‌పురాలో గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే తొలగింపు జాబితాలోని పేర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్రంగా పరిశీలించాల్సిన విషయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

# వైసీపీ తెలంగాణ నేతగా కోమటిరెడ్డి?

వైసీపీ పార్టీ ఎన్‌ఆర్‌ఐ టీమ్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యక్ష ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని, అందుకే గత కొన్ని నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథానే తనకు ఆదర్శమని ఈ వేదికగా రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, విద్యా రంగానికి ఎంతో కీలకమైన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించలేని దయనీయమైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాజకీయాన్ని కేవలం వ్యాపారంగా మార్చుకుని, పైసలు సంపాదించడమే ధ్యేయంగా వచ్చిన వాళ్లు రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడలేరని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన అవినీతి, నేడు గ్రామీణ స్థాయి వరకు పాకిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బంధు లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఒక చేతితో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నటిస్తూనే, మరో చేతితో గల్లీ గల్లీలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచి ఆ డబ్బును ప్రజల నుంచి దారుణంగా గుంజుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు సంక్షేమం అందించడానికి బదులు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని మండిపడ్డారు. గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలనాత్మక నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం తెలంగాణ గడ్డపై వైఎస్ఆర్‌సీపీని తిరిగి బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో కచ్చితంగా విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తానని చెప్పారు. అంటే వైఎస్ఆర్‌సీపీని ఆయన తెలంగాణలో ప్రారంభించి దానికి నాయకత్వం వహించే దిశగా ఆలోచిస్తున్నారని అనుకోవచ్చు. రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. ఆయన నిత్యం ఒక సొంత ఇమేజ్, అగ్రెసివ్ మార్క్ రాజకీయం కోరుకునే నాయకుడు. గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి, మళ్లీ అక్కడ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం వెనుక ఆయన ఆశించిన రాజకీయ ప్రాధాన్యతే ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ నిరంతరం ఆలస్యం కావడం, తనకు మంత్రి పదవి దక్కకపోవడం పట్ల ఆయన వర్గం తీవ్ర తీవ్ర అసంతృప్తితో ఉంది.



ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి నాయకత్వానికి పోటీగా లేదా తన ఉనికిని చాటుకునేందుకు వైఎస్సార్ భావజాలాన్ని ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకోవడం ఆయన వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. వైఎస్సార్ పేరు తెలంగాణలో ఇప్పటికీ కొంతమంది ఓటర్లలో సానుభూతిని నింపగలదని ఆయన భావిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో వైఎస్సార్‌పై ఉన్న అభిమానం అంతరించిపోలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను, పాత వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను ఒక తాటిపైకి తెచ్చి సొంత సైన్యాన్ని నిర్మించుకోవడానికి రాజగోపాల్ రెడ్డికి ఇది ఉపయోగపడవచ్చు. ఏ నిర్ణయమైనా ధైర్యంగా తీసుకునే ఫైటింగ్ నెచర్ రాజగోపాల్ రెడ్డి సొంతం. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడని ఆయన నైజం.. తెలంగాణలో ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కావాల్సిన ఆర్థిక, రాజకీయ సత్తాను ఇస్తుంది. ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ జెండాతో తెలంగాణలో రాజకీయం చేయడం ఎంత ప్రమాదకరమో షర్మిల అనుభవాలు నిరూపించాయి. ఏపీ కేంద్రీకృత పార్టీగా ముద్రపడిన వైఎస్సార్‌సీపీని తెలంగాణలో రీ-ఓపెన్ చేస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఆయనపై ఆంధ్రా పార్టీ అనే బలమైన తెలంగాణ సెంటిమెంట్ దాడిని విసిరే అవకాశం ఉంది. ప్రస్తుతానికి రాజగోపాల్ రెడ్డి వేస్తున్న అడుగులు కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగమని కొందరు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ కేబినెట్ పదవి ఇవ్వకపోతే, ఆయన కాంగ్రెస్‌ను వీడి సొంత దారి చూసుకోవడం ఖాయం. కానీ నేరుగా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుంటారా లేక వైఎస్సార్ పేరుతో కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుంటారా అనేది వేచి చూడాలి. తెలంగాణ రాజకీయాల్లో వాక్యూమ్ ఉందనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ని తెలంగాణలో పునరుద్ధరించడం అత్యంత సాహసోపేతమైన అడుగు. ఈ రిస్క్ చేసి ఆయన తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా లేదా మంత్రివర్గ విస్తరణ వరకు వేచి చూస్తారా అన్నదే రాబోయే రోజుల్లో తేలనుంది.

## హస్తంలో హై టెన్షన్!

-మొదటిపేజీ తరువాయి

చిక్కుముడులను, గందరగోళాన్ని, వారిలో ఉన్న మనస్పర్థలను తొలగించేందుకే అధిష్టానం ఆదేశాలు జారీ చేశారని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత వెల్లడించారు, ఎంతోకాలంగా మంత్రివర్గ విస్తరణ చేయాలని జాతీయ స్థాయి నాయకత్వం యోచిస్తుంది ఈ తరుణంలో కూడా కాంగ్రెస్ నేతలని పిలిచి ఉండవచ్చని మరో నాయకుడు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అందువల్లనే

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకేరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. కేంద్రమంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీల నేపథ్యంలో పాలనాపరమైన అంశాలతో పాటు పార్టీ వ్యవహారాలపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది.

**ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్.. ఒకేరోజు హస్తినబాట పట్టిన కీలక నేతలు**

తెలంగాణ కాంగ్రెస్ , కేరాఫ్ ఢిల్లీ. హస్తం పార్టీ కీలక నేతలంతా హస్తిన బాట పట్టడంతో.. అసలు ఏం జరుగుతోందన్న చర్చ జోరందుకుంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పలువురు కేంద్రమంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో కూడా రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశం ఉండడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక ఇదే సమయంలో మంత్రి కొండా సురేఖ కూడా ఢిల్లీ చేరుకున్నారు. సురేఖ వెళ్లిన ఫ్లైట్‌లోనే మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి కూడా ఢిల్లీ వెళ్లడం ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ కానున్నారు కొండా సురేఖ. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కూడా కోరారు సురేఖ. ముఖ్యమంత్రితోపాటు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఇప్పటికే ఢిల్లీలో ఉండగా మంత్రులు తుమ్మల, సీతక్క కూడా వరుసగా ఢిల్లీ చేరుకుంటున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బుధవారం ఢిల్లీ చేరుకుంటారు. కొందరు మంత్రులు పాలనాపరమైన అంశాలపై ఢిల్లీ బాటపట్టగా, మరికొందరు పార్టీ పనులపై హస్తిన చేరుకుంటున్నారు.

కీలక నేతల హస్తిన టూర్‌తో కేబినెట్ విస్తరణపై కూడా టాక్స్ వినిపిస్తున్నాయి. మంత్రిపదవిపై ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లడం, కేసీ వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉండటం ఆసక్తి రేపుతోంది. ఇక స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ తాజా రాజకీయ పరిస్థితులపై ఖర్గేతో చర్చించిన గడ్డం ప్రసాద్.. కేబినెట్‌లో చోటు కల్పించాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది..

## థౌజండ్‌వాలా

-మొదటిపేజీ తరువాయి

కానీ, ఈసారి థౌజండ్‌వాలా సెలబ్రేషన్స్‌ని కొత్తగా ప్లాన్ చేసినట్టున్నారు. ప్లాన్‌బీని అమల్లో పెట్టినట్టునట్టంది రేవంత్ సర్కార్. ఏమిటా ప్లాన్‌బీ? ఎవరిని టార్గెట్ చెయ్యడానికి? ప్రోగ్రామ్ థీమ్ ఏంటంటే... అంబర్‌పేట్‌లో మూసీనదిపై 52 కోట్లతో కట్టిన బ్రిడ్జిని ప్రారంభించడం. తర్వాత స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్.. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్. కానీ, ఆ స్పీచ్‌కాపీలోనే ఒక చిన్న ఛేంజ్. చిన్నది కాదు పెద్దదే. మెయిన్ అపోజిషన్ పార్టీ ఊహించిందో లేదో గాని, రేవంత్‌రెడ్డి నుంచి బిగ్ అండ్ బిగ్గర్ ఛాలెంజ్. నీ పదేళ్ల విధ్వంసం.. నా వెయ్యి రోజుల సుపరిపాలన.. ఎవరెంత తోపో తేల్చుకుందామా అని. 2023 డిసెంబర్ 7న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సోనియా, రాహుల్, ప్రియాంక సమక్షంలో సీఎంగా రేవంత్‌రెడ్డి...

## 'శుద్ధీకరణ' పేరుతో సామాజిక అవమానం...




-మొదటిపేజీ తరువాయి

నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత 'శుద్ధి' చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. "మనిషిని మనిషిగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని,కానీ మనిషి నిలిచిన నేలను కూడా 'శుద్ధి' చేయాలనే మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఇటువంటి సామాజిక వివక్షకు భారతదేశం సాక్షిగా నిలవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో జరిగిన 'విజయ్ శంఖనాద్' బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ప్రసంగించారని ఉత్తమ్ గుర్తుచేశారు. ఖర్గే ఏ మతాన్నీ, ఏ వర్గాన్నీ ప్రస్తావించలేదని, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని తెలిపారు. అయితే సభ జరిగిన రెండు రోజుల తర్వాత అదే వేదికపై శ్రీరామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్‌కు చెందిన సభ్యులు 'శుద్ధీకరణ' హవనం నిర్వహించారని పేర్కొన్నారు. అవమానించినవారిని వదిలేసి... ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఘటన కంటే దానిపై అధికార వ్యవస్థ స్పందించిన తీరు మరింతగ్భ్రాంతికరమని ఉత్తమ్ మండిపడ్డారు. 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే అవమానకరమైన 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా, అదే సంస్థకు చెందిన సభ్యుడి ఫిర్యాదు ఆధారంగా ఆగస్టు 30న ఉత్తరాఖండ్ పోలీసులు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. "అవమానకరమైన చర్యను చేసినవారు ప్రశ్నలకు అతీతులా? ఆ చర్యను ప్రశ్నించిన వ్యక్తే నిందితుడా? ఇదే న్యాయమైతే న్యాయం అనే పదానికే కొత్త నిర్వచనం రాయాల్సి వస్తుందని ఆయన ఘాటుగా స్పందించారు. తప్పును ప్రశ్నించిన గొంతుపై కేసు పెట్టి, తప్పుకు కారణమైన చర్యను పక్కనపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తినే తలకిందులు చేసే రాజకీయ ధోరణి" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్ మరో ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు. ఎఫ్ఐఆర్‌లతో సత్యాన్ని సంకెళ్లలో బంధించలేరు"ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగితే సత్యం మారదు. కేసులు పెరిగితే ప్రశ్నలు చనిపోవు. అధికార బలం పెరిగితే రాజ్యాంగం చిన్నదైపోదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు. సామాజిక వివక్షను ఎదిరించడం అంతకంటే నేరం కాదు" అని ఉత్తమ్ స్పష్టం చేశారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలతో పాటు సమాజంలోని ప్రతి అణగారిన వర్గానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా కులవివక్ష, ద్వేషం, బెదిరింపు రాజకీయాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

భద్రాద్రి న్యూస్ తెలుగు దినపత్రిక
www.bhadradrinews.com
Bhadradrinews Telugu Daily

# డిల్లీ నడిబొడ్డున కథంతొక్కిన భద్రాద్రి జిల్లా సిపిఐ శ్రేణులు

- లక్షలాది మందికి పోరాట స్ఫూర్తినిచ్చిన రాంలీలా మైదాన్ సభ
- మార్పుకోసం జరిగే పోరాటాల్లో భద్రాద్రి జిల్లా అగ్రభాగం
- ప్రజావ్యతిరేక పాలనపై ఢిల్లీ వేదికగా జరిగిన సభ ప్రారంభం మాత్రమే
- సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా




**కొత్తగూడెం అర్బన్ / న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 1 (భద్రాద్రిన్యూస్ ):-** : దేశంలో మార్పు కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఆ పోరాటాలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శ్రేణులు ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు.

?దేశంలో మార్పు రావాలనే ప్రధాన నినాదంతో 'బద్లావ్ జరూరి హై' దేశ రాజధాని న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలల నుంచి 500 మందికి పైగా సిపిఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజలు భారీ ఎత్తున తరలివెళ్లారు. అజ్మీరీ గేట్ సెంటర్ నుంచి రాంలీల మైదానం వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ నాయకులు కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ

?కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా, విద్యార్థి, నిరుద్యోగ, మహిళా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తున్న పాలకుల తీరును ఎండగట్టేందుకే రాంలీలా మైదానంలో ఈ మహా గర్జన నిర్వహించామని తెలిపారు.

?ఈ మహాసభ ఇచ్చిన గొప్ప స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా సమరశీల ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ర్యాలీలో నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, కంచర్ల జమలయ్య, బి పూర్ణచంద్రరావు, మువ్వ వెంకటేశ్వరరావు, చంద్ర నరేంద్ర కుమార్, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శులు వాగబోయిన రమేష్ అనంతనేని సురేష్ డి సుధాకర్ జక్కుల రాజబాబు, కార్పొరేటర్లు సర్పంచులు పార్టీ ప్రజాసంఘాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై కేసు నమోదు సబబు కాదు

- బీజేపీ వైఖరిని ఖండించిన కాంగ్రెస్ నేతలు
- మహబూబాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ధర్నా

**మహబూబాబాద్, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబమని, రాజకీయ కక్షతోనే ఆయనపై కేసులు, ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీ ర్యాలీ వేదిక వద్ద బీజేపీ-ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తున్న కులతత్వ "శుద్ధీకరణ ఆచారం"పై కూడా ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని, ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని జూలకంటి సీతారాం రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త వినయ్ బాబు, వర్షిక రాజు, షేక్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- పీఆర్సీ, పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్
- సీపీఎస్ రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదు





**కోదాడ, సెప్టెంబర్ 1(భద్రాద్రి న్యూస్):** "ోదాడ మండల పరిధిలో రెవిన్యూ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపు లో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసారు.సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం,తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. టీఎన్జీవో కోదాడ అధ్యక్షులు గడ్డం చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా గడ్డం చిరంజీవి మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారిందని, తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ నివేదికను అమల్లోకి తేవాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట నగేష్, ట్రెజరర్ మహేష్, నాయకులు పులి శ్రీను, పవన్, ముస్తఫా, విక్రమ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదు

- ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందాలి
- కారేపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు



**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో డాక్టర్ రామారావు నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యుల అందుబాటు, ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల ద్వారానే మెరుగైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

**విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ**

అనంతరం కారేపల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాలను డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన, భోజనం నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.

**ఆశా కార్యకర్తల సేవలు అభినందనీయం**

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేయడంలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని డాక్టర్ రామారావు పేర్కొన్నారు. ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి కుటుంబానికి చేరేలా మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో మందుల కొరతపై యువజన కాంగ్రెస్ ఆగ్రహం

- పేద రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి
- సకాలంలో మందులు సరఫరా చేయాలి: హర్ష నాయక్



**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో లేవని, దీంతో వైద్యం కోసం వచ్చే పేద, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని యువజన కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభించాల్సిన మందులు అందకపోవడంతో రోగులు బయట మందుల దుకాణాల్లో డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు.యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలను ప్రధానంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలే ఆశ్రయిస్తారని తెలిపారు. అలాంటి వారికి ఉచితంగా అందాల్సిన మందులు ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. రోజువారీ కూలీలు, వృద్ధులు, మహిళలు, నిరుపేద కుటుంబాలకు చెందిన రోగులు మందుల కోసం బయటకు వెళ్లాల్సి రావడం వల్ల వారిపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మందులు అందుబాటులో లేకపోతే వైద్యం ఎలా?**

వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు సూచిస్తున్నప్పటికీ, కొన్ని మందులు ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని యువజన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం తగ్గే అవకాశం ఉందన్నారు. మందుల కొరతపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించగా జిల్లా కేంద్రం నుంచి అవసరమైన మందుల సరఫరా సకాలంలో జరగడం లేదని వారు తెలిపినట్లు యువజన కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కారేపల్లి పీహెచ్‌సీకి అవసరమైన మందులను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**కొరత రాకముందే నిల్వలు ఏర్పాటు చేయాలి**

పీహెచ్‌సీలో అత్యవసరంగా అవసరమయ్యే మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి, కొరత ఏర్పడకముందే వాటిని అందుబాటులో ఉంచేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. పేద ప్రజలు తమ జేబు నుంచి డబ్బులు వెచ్చించి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని వెంటనే నివారించాలని విజ్ఞప్తి చేశారు. కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచి, ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేష్ నాయక్, మండల కార్యదర్శి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే వంతెనల మంజూరు కోసం కృషి చేస్తున్నా

- ప్రజా భద్రత, రవాణా సౌకర్యాలే లక్ష్యంగా ప్రణాళికలు
- రైల్వే శాఖ అనుమతులతో త్వరలోనే పనులు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 1 (భద్రాద్రిన్యూస్) :** ప్రజల భద్రత, సాఫీగా రాకపోకలు సాగించేందుకు నియోజకవర్గ పరిధిలో రైల్వే వంతెనలు, గేట్ల నిర్మాణం అత్యంత ఆవశ్యకమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, లెవల్ క్రాసింగ్‌లు, ఆర్వోబీ, ఆర్‌యూబీల మంజూరు కొరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించి నిరంతరం కృషి చేస్తున్నామని మంగళవారం ఆయన తెలిపారు. ఈ ప్రయత్నాల ఫలితంగా మంగళవారం రైల్వే ఏడీఈ రవి, జేఈ జావిద్, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు సంబంధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారని పేర్కొన్నారు. బూడిదగడ్డ వద్ద వర్షాల సమయంలో ఎదురయ్యే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్త ఆర్‌యూబీ లేదా గేటు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను కోరినట్లు వెల్లడించారు. హేమచంద్రాపురం బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఆర్వోబీ, రైటర్ బస్తీ-గొల్లగూడెం మధ్య రవాణా సౌలభ్యం కోసం ఆర్‌యూబీ నిర్మాణాలను ప్రతిపాదించినట్లు వివరించారు. రామవరం-గరిమెళ్ళపాడు మధ్య సురక్షిత ప్రయాణానికి రైల్వే గేటు లేదా ఆర్‌యూబీ, అలాగే సింగరేణి మెయిన్ హాస్పిటల్ వద్ద రద్దీకి అనుగుణంగా ప్రస్తుత ఆర్వోబీ విస్తరణ పనులు త్వరలోనే పట్టాలెక్కేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ నాలుగు ప్రతిపాదనలకు త్వరలోనే మంజూరి లభించి నిధులు విడుదలవుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# సామాజిక సేవలకు బాణోత్ వెంకటేష్‌కు డాక్టరేట్




**కూసుమంచి, సెప్టెంబర్ 1( భద్రాద్రి న్యూస్):** కూసుమంచి కి చెందిన ఉద్యోగి భాణోత్ వెంకటేష్ కు డాక్టరేట్ లభించింది. దేవాలయాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు, వృద్ధులకు సేవలు అందించడం, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, తలసేమియా బాధితులకు రక్తదానం చేస్తూ సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న బాణోత్ వెంకటేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాదులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వేదికపై భానోత్ వెంకటేష్ కు ఆదివారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం జిన్ను రామశర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం సంధ్యాతండా గ్రామానికి చెందిన బాణోత్ వెంకటేష్, బాణోత్ మోదీన్ కుమారుడు. ప్రస్తుతం ఖమ్మం నగరంలోని శ్రీ హవిషా హాస్పిటల్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తన సొంత ఖర్చులతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.మారుమూల ప్రాంతాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించడం, దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందించడం, తలసేమియా బాధితులకు అవసరమైన సమయంలో రక్తదానం చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి బాణోత్ వెంకటేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# టియుసిఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సి ల్ ను జయప్రదం చేయండి

-కొమరం శాంతయ్య జిల్లా నాయకులు



**గుండాలసెప్టెంబర్ 1 భద్రాద్రి న్యూస్ :** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ గుండాల ఏరియా కమిటీ ముఖ్యుల సమావేశం స్థానిక ఆఫీస్ ఆవరణలో మంగళవారం 1 సెప్టెంబర్ గుండాల మండల కేంద్రంలో. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆఫీస్ లో ఈ సమావేశం జరిగింది. గడ్డం రమేష్ అధ్యక్షతన నిర్వహించి. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి పాయం వెంకన్న జిల్లా నాయకులు కోరం శాంతయ్య పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 6న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని మండలంలో ఉన్న కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆటో మోటార్ బిఓసి హమాలీ ఆశ అంగన్వాడి కేజీబీవీ ఏపీఆర్ మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ హెల్త్ కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు సామాజిక భద్రత అమలు కావడం లేదని వారి సందర్భంగా అన్నారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వాటికి కేటాయించిన నిధులన్నింటిని వాటికే ఉపయోగించాలని, డిమాండ్ చేశారు. 6నే జరిగే జనరల్ కౌన్సిల్ లో చర్చించి భవిష్యత్తు కార్మిక పోరాటాలకు నిర్ణయం చేయబోతున్నారని కార్మికులు జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు. ఏరియా కమిటీ అధ్యక్షులు. గడ్డం రమేష్. మాచర్ల కోటి .మహేష్. మొక్క నరి. జగన్ కొప్పుల నరసయ్య కుమార్ .కిసింధర్. ఆ సన్నీ. కిరణు.వంశీ పాల్గొన్నారు

# వైరా ఐదో వార్డులో కల్వర్టుకు శంకుస్థాపన

- కల్వర్టుకు శంకుస్థాపన చేసిన వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి



**వైరా, ఆగస్టు 1, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఐదవ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి కల్వర్టుకు శంకుస్థాపన చేశారు చేశారు ఆరో వార్డులో కల్వర్టు రిపేరులను పరిశీలించిన అనంతరం చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ అన్ని వార్డుల అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తామని ప్రతి వార్డు అభివృద్ధికి స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆమె పేర్కొన్నారు. స్వచ్ఛ వైరా, స్వచ్ఛ మున్సిపాలిటీ అనే నినాదంతో ప్రజల ముందుకెళ్లాలని ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి ఆయా మున్సిపల్ వార్డులలో శుభ్రపరచాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీ మాన్య, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

www.bhadradrinews.com
# భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
బుధవారం
2 । సెప్టెంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

## గ్రామపంచాయతీ అవినీతి ఆరోపణపై విచారణ



**గుండాల: సెప్టెంబర్1, భద్రాద్రి న్యూస్:** మండల పరిధిలోని కాచనపల్లి గ్రామపంచాయతీలో అవినీతి జరిగిందని కొందరు గత నెలలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా వారి ఆదేశాల మేరకు డి ఎల్ పి ఓ ప్రభాకర్ పంచాయితీ కార్యాలయంలో పాలకవర్గం సమక్షంలోవిచారణ నిర్వహించారు వీరి వెంట ఎంపీ ఓ బండారి త్రిలోక్ కూడా ఉన్నారు అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్ తన సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు. ఈ విచారణ లో సర్పంచ్ జరుపుల కిషన్, ఉప సర్పంచ్ పూనెం అశోక్ కుమార్, వార్డు సభ్యులు ఆ ట్టికం సుజాత ధన సరి సుశీల, పూణెం లక్ష్మి, పూణెం కావేరి, భూక్య బాలాజీ, ఇస్లావత్ అఖిల, పడిగ రమణ వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్రైస్తవుల స్మశాన వాటికకు స్థలం కేటాయింపునకు చర్యలు

*– దమ్మపేటలో దైవ సేవకుల కమిటీ సమావేశం*



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 1:** దమ్మపేట మండల దైవ సేవకుల కమిటీ సమావేశం మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ క్రైస్తవులకు ప్రత్యేక స్మశాన వాటిక లేకపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని త్వరలోనే స్మశాన వాటిక ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సర్పం పగడాల రమాదేవి మాట్లాడుతూ స్మశాన వాటిక కోసం స్థలం కేటాయింపు ప్రక్రియను చేపడతామని తెలిపారు.

## కలెక్టర్ దివాకర టి.ఎస్.ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**- పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేసిన రాందాస్ నాయక్**

**- వైరా నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు**



**వైరా, ఆగస్టు 1, (భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం ఖమ్మం కలెక్టరేట్లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, మనకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్కు అందజేశారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, వైరా శాసనసభ్యులు మాలోత్త రామదాసు నాయక్ జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ అభివృద్ధి పనులతో పాటు, రైతుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## కొత్తగూడెం ఎయిర్ పోర్ట్ కల సహకారం దిశగా అడుగులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరిన మంత్రి తుమ్మల



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 1:** కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన తుమ్మల ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై చర్చించారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన రామ్మోహన్ నాయుడు సెప్టెంబర్ 7న ప్రతినిధుల బృందాన్ని కొత్తగూడెంకు పంపిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలం రామాలయానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎయిర్‌పోర్ట్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని తుమ్మల తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక, విద్యా, పర్యాటక అభివృద్ధికి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ దోహదపడుతుందని, నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నేత మదన్‌లాల్..

**- ఆశయ సాధనలో మనీషా లక్ష్మి**

**- బస్వాపురంలో హేమశ్రీ కుటుంబానికి పరామర్శ.. అండగా ఉంటానని భరోసా**

**- మదన్‌లాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న కుమార్తె**



**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు):** వైరా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆశయాలను ఆయన కుమార్తె, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి ముందుకు తీసుకెళ్తున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన హేమశ్రీ కుటుంబాన్ని బానోత్ మనీషా లక్ష్మి పరామర్శించారు. హేమశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యుల చేతులు పట్టుకుని వారికి ధైర్యం చెబుతూ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తండ్రి మదన్‌లాల్ ఎల్లప్పుడూ ప్రజల మనిషిగా జీవించారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని మనీషా లక్ష్మి పేర్కొన్నారు. "మీ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాను. అధైర్యపడకండి.. మేమున్నాం" అంటూ బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడి గ్రామస్తులు, మహిళలు మనీషా లక్ష్మిలో మదన్‌లాల్‌ను చూసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాముల వెంకటేశ్వర్లు, ఆర్.వి., రావూరి సురేష్, సాయితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

**- గిరిజన నర్సింగ్ విద్యార్థిని మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి**

**-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**సింగరేణి మండల సర్పంచుల సంఘం డిమాండ్**




**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఊకే శిరీష మృతి ఘటనపై సింగరేణి మండల సర్పంచుల సంఘం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కేసును వేగంగా దర్యాప్తు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండ అవసరం**

శిరీష కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని సర్పంచుల సంఘం నాయకులు కోరారు. కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని సర్పంచుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదేపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, ఉపాధ్యక్షుడు, రేగులగూడెం సర్పంచ్ ఈసం మూతి వీరస్వామి, పోలంపల్లి సర్పంచ్, దిశ కమిటీ సభ్యురాలు ధారావత్ హేమలత బాలాజీ, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్, గుట్టకింద గుంపు సర్పంచ్ ఉండం రాఘవులు, మోట్లగూడ సర్పంచ్ పొడుగు పెంటయ్య, గేట్ కారేపల్లి సర్పంచ్ పూసం ఎల్లయ్య, గిద్దవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కళ్యాణ్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై కేసులకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

**- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తాం**

**- కారేపల్లిలో కదం తొక్కిన సర్పంచులు, కాంగ్రెస్ శ్రేణులు**




**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు కారేపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును నిరసించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తూ, ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తున్న రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే నాయకులపై కేసులతో ఒత్తిడి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి**

రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై ఆయన చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి గ్రామస్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా నిలిచి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతాయని తెలిపారు. ప్రజల హక్కులకు భంగం కలిగించే విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు**

మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది. రాహుల్ గాంధీపై కేసులను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ రెసిడెన్షియల్ స్కూల్లో ఆకస్మిక తనిఖీ

**- స్టోర్ రూమ్ లో నిల్వ ఉన్న కుళ్ళిన వంట సామాగ్రీ**

**- సిబ్బందిని హెచ్చరించిన జిల్లా కలెక్టర్**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 01 (భద్రాద్రి న్యూస్) :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ -- పాల్వంచ, ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ పాఠశాల 15 ఎకరాల విస్తీర్ణంలో 2017 ఏడాదిలో నిర్మించగా గతంలో పాల్వంచ ప్రాంతంలో ఉండగా, ప్రస్తుతం కొత్తగూడెం ప్రాంతానికి తరలించిన ఈ ఏకలవ్య మోడల్ స్కూల్ లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులకు విద్యా తరగతులు, వసతి సౌకర్యాలు అందుతుండగా, ఆ భవన సముదాయాలను, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలు జిల్లా కలెక్టర్ పాఠశాల ఇన్చార్జి మున్సిపల్ ప్రశంజీత్ భూసాల్ ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టీచింగ్ విభాగంలో 23 రెగ్యులర్ సిబ్బంది, 12 మంది ఔట్సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, నాన్ -- టీచింగ్ విభాగంలో ఐదుగురు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. 240 మంది బాలికలకు, 240 మంది బాలురకు ప్రత్యేక వార్డెన్స్ వేర్వేరుగా ఉన్నారని, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. విజయ గత నెల ఆగస్టు 17వ తేదీ నుంచి సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పాఠశాల ఆవరణలో ఉన్న డైనింగ్ హాలులో వంట వండుతున్న కుకింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన వంటకాలను అన్నం, పప్పు, సాంబార్,రసం, పెరుగు, కోడిగుడ్లను, రాత్రి భోజనం కోసం వంట చేసేందుకు సిద్ధం చేసుకున్న కాయగూరలను పరిశీలించి కుకింగ్ చేసే వంట మనిషితో, హెల్పర్లతో మాట్లాడారు. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు సిద్ధం చేసి అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అదే విధంగా డైనింగ్ హాల్ లో ఉన్న స్టోర్ రూమ్, ఆర్.ఓ.ఆర్ ప్లాంట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న కాయగూరలు, ఉల్లిగడ్డ, నిల్వ ఉన్న పప్పు దినుసులు, బియ్యం, సబ్బులు, సర్ఫు, షాంపులు, తదితర సామాగ్రిని ఎప్పుడు కొనుగోలుచేశారని, ఎంతకాలం నుంచి నిల్వ ఉంచుతారని క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నిల్వ ఉన్న బెల్లం కుళ్ళి ఉండడాన్ని పరిశీలించి క్యాటరింగ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేసి సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం పట్టణం లో జీవో 76ను వెంటనే అమలు చేయాలి

**- బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష**




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 01 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం పట్టణం బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం దగ్గర బస్టాండ్ సెంటర్లో జీవో నెంబర్ 76ను వెంటనే అమలు చేసి, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ వద్ద ఒకరోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికైనా స్పందించాలని స్పందించాలని జీవో నెంబర్ 76 అర్హులైన పేదలందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని పలికారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మొద్దు నిద్రలో ఉన్న ఎమ్మెల్యే వెంటనే మేల్కొని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ముందుగా కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేసిన అనంతరం ఢిల్లీలో బీజేపీపై పోరాటాలు చేయాలని పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ సూచించారు. ప్రజలకు సంబంధించిన జీవో నెంబర్ 76ను వెంటనే అమలు చేయాలని, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో జిల్లా నాయకులు సీతారాములు నాయక్, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, పోనీశెట్టి వెంకటేశ్వర్లు, నోముల రమేష్, రాయుడు నాగేశ్వరరావు, ఆదిమూల రాములు, కనుకుంట్ల రాజమౌళి, భూక్య రాజేష్, తెలంగాణ క్రాంతి, సంపత్ గౌడ్, తెల్లం నర్సింహా రావు, మాలోత్ గాంధీ, కొత్తూరు శ్రీనివాస్, నరసింహారావు దొర, మహిళా నాయకురాలు భూక్యా పూర్ణ, అలివేలు, బొందుగుల యామిని, హాసిని, పట్టణ ప్రధాన కార్యదర్శిలు చంద్రగిరి రమేష్, కలంకార రాజశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ , భాస్కర్ గౌడ్, రవి, గిరి నరసింహులు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిరీష హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

**- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి**

**- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి**



**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీషపై జరిగిన అత్యాచారం, అనంతరం జరిగిన దారుణ హత్య ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని ఉసిరికాయలపల్లి సీనియర్ నాయకురాలు బోడ జ్యోతి రవి డిమాండ్ చేశారు. శిరీష మృతి ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక ఆదివాసీ యువతి ప్రాణాలు కోల్పోయినప్పటికీ, ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి ఘటనకు సంబంధించిన అసలు వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీషపై దారుణానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, వేగవంతమైన విచారణ చేపట్టి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతుండటం ఆందోళనకరమని బోడ జ్యోతి రవి పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉన్నప్పటికీ దళిత, గిరిజన మహిళల ప్రాణాలు, గౌరవం, భద్రతకు పూర్తి స్థాయిలో రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులపై దాడులు జరిగినప్పుడు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, అనంతరం కేసులను బలహీనపరిచే ప్రయత్నాలు, రాజకీయ ఒత్తిళ్లు, రాజీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. నేరస్థులను కాపాడేందుకు ప్రయత్నించే ఏ రాజకీయ నాయకుడైనా, ప్రభావశీలుడైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి పరిహారం, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల సాగుభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలవాలని బోడ జ్యోతి రవి డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు, ఆదివాసీ సమాజం తరఫున పోరాటం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

# శిరీష కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలి



**- మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి**
**- నిందితులను కఠినంగా శిక్షించాలి..**
**మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్**

**కారేపల్లి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీష మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం అందించాలని పోలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ యువతి శిరీషపై అత్యాచారం జరిగిందని, అనంతరం ఆమె మృతి చెందిందని వస్తున్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భద్రునాయక్ అన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేసును కేవలం సాధారణ దర్యాప్తుకే పరిమితం చేయకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**నేరస్థులను కాపాడే ప్రయత్నాలను అడ్డుకోవాలి**

దళిత, గిరిజన మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, వేధింపుల ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని భద్రునాయక్ పేర్కొన్నారు. రాజ్యాంగం హక్కులు కల్పించినప్పటికీ మహిళల ప్రాణాలు, గౌరవం, భద్రతకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధితులపై దాడులు జరిగిన సందర్భాల్లో కేసులు నమోదు చేసిన అనంతరం వాటిని బలహీనపరిచే ప్రయత్నాలు, రాజకీయ ఒత్తిళ్లు, రాజీలకు సంబంధించిన ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. నేరస్థులను కాపాడేందుకు ఎవరైనా ప్రయత్నించినా, వారు ఎంతటి ప్రభావవంతమైన వ్యక్తులైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు.

**బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి**

శిరీష మృతి ఘటనపై వేగవంతమైన దర్యాప్తు చేపట్టి, నేరానికి పాల్పడినట్లు నిర్ధారణ అయిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని భద్రునాయక్ డిమాండ్ చేశారు. కేసు విచారణను వేగవంతం చేసి బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం అందించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐదు ఎకరాల సాగుభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని దారావత్ భద్రునాయక్ స్పష్టం చేశారు.

# శిరీష హత్యపై భగ్గుమన్న గిరిజన గళం!

**- నిందితుడిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి**
**- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి.. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి**
**- శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేత గుమ్మడి సందీప్**



**టేకులగూడెం, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చేవిటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఒకే శిరీషను అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటనపై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కారేపల్లి--కామేపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి గుమ్మడి సందీప్ తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. శిరీషను హత్య చేసిన నిందితుడిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టేకులగూడెం గ్రామంలో మాస్‌లైన్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గొగ్గల రాము ఆధ్వర్యంలో మహిళలతో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి సందీప్ మాట్లాడుతూ.. శిరీష హత్య ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**నిజాలు నిగ్గుతేల్చాలి.. న్యాయ విచారణ జరపాలి**

శిరీష మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని గుమ్మడి సందీప్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఒక అమాయక ఆదివాసీ యువతి ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

**దళిత, గిరిజన మహిళలకు భద్రత ఎక్కడ?**

రాష్ట్రంలో దళిత, గిరిజన మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. రాజ్యాంగం హక్కులు కల్పించినప్పటికీ దళిత, గిరిజన మహిళల ప్రాణాలు, గౌరవం, భద్రతకు పూర్తి రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

**రూ.కోటి పరిహారం.. ప్రభుత్వ ఉద్యోగం.. 10 ఎకరాల భూమి**

శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మడి సందీప్ కోరారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 10 ఎకరాల సాగుభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. "శిరీష కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది. అవసరమైతే మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం" అని గుమ్మడి సందీప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బిక్కసాని భాస్కరరావు, వార్డు సభ్యులు దోమల సీత, కోడెం రమణ, గ్రామ పెద్దలు గుమ్మడి ఎర్రయ్య, రామారావు, కోడెం సీతారాములు, జోగా రవి, మహిళలు స్వర్ణభాకా అనసూయ, దోమల సుజాత, దోమల కోటమ్మ, మోకాళ్ల కోటమ్మ, గుగ్గల ఉమాదేవి, గుమ్మడి శిరీషతో పాటు అధిక సంఖ్యలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ఊకె శిరీషకు న్యాయం చెయ్యాలి

**- కొవ్వొత్తుల ర్యాలీ**



**గుండాల, సెప్టెంబర్ 01, భద్రాద్రి న్యూస్:** హత్యకు గురైన శిరీషకు నివాళులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ గుండాల మండల పెద్దతోగు గ్రామంలో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ములకల పల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష తమ జీవన ఉపాధికై మరియు ఉద్యోగ అభివృద్ధి కై హైదరాబాద్ లోనీ ప్రైవేట్ హాస్పిటల్ నందు నర్సు ఉద్యోగం చేస్తున్న శిరీషను హత్య చేసిన సైనా ఉల్లా ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం . కొవ్వొత్తుల ర్యాలీలో సనప విష్ణు, సనప రజిత, కల్తీ రవి, రష్మిక , తాటి సరస్వతి , తాటి సంధ్యారాణి తో పాటు పలువురు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శిరీషకు న్యాయం చేయాలి.. నిందితుడికి కఠిన శిక్ష పడాలి

**- అత్యాచారం, హత్య ఘటనపై నిరసనగా విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ**




**దమ్మపేట భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 01:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చో

చౌటిగూగూడెం గ్రామానికి చెందిన శిరీష నర్స్ ను అత్యాచారం, హత్య చేసిన ఘటనపై నిరసనగా రాచురుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు, గ్రామ యూత్, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు చేతబట్టి శిరీషకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాకీ శ్రీను, సోయం మోహన్, సోయం రాముడు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్నం దాటితే.. మందులు కరువు!

**- ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరతతో రోగుల అవస్థలు.. బయట నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి**




**చర్ల: సెప్టెంబర్ 1 భద్రాచలం న్యూస్ :** చర్ల ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్నం సమయం దాటిన తర్వాత ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట మెడికల్ షాపులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వచ్చే పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా మందులు అందాల్సి ఉండగా, మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు బయట నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులపై అదనపు భారం పడుతోంది. "ప్రభుత్వాసుపత్రికి వస్తే మందులు బయట కొనుక్కోవాల్సి వస్తోంది. ఉచిత వైద్యం, ఉచిత మందులు అందుతాయని ఆశించి వస్తున్న పేదలకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది" అని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, పంపిణీ విధానంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రోగులకు అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరతకు అసలు కారణమేంటో అధికారులు వెల్లడించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



**కామేపల్లి,సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐ టియు కామేపల్లి మండల ఏడవ మహాసభ భూక్య రమణ అధ్యక్షతన జరిగింది

ఈ మహాసభలో బిల్డింగ్ వర్కర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మాచారి ముదాం శ్రీను పి రమ్య పాల్గొని. ప్రసంగిస్తూ బిల్డింగ్ రంగం కార్మికులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని వారికి అర్హులైన వారందరికీ ఇన్సూరెన్స్ ఇవ్వాలని 60 సంవత్సరాల దాటిన వాళ్ళకి 5000 పెన్షన్ ఇవ్వాలని లేబర్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరికి వర్తింపచేయాలని కార్మికులకు రక్త పరీక్ష నిలుపుదల చేయాలని లేబర్ ఇన్సూరెన్స్ లో 90 రోజుల ను తొలగించాలని డైరెక్ట్ కార్మికులను గుర్తించి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్ లను లేబర్ చట్టం ద్వారా ఇవ్వాలని కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాధావత్ శ్రీను రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ కొత్తపల్లి ఉపేందర్ పింగళి రామ్మూర్తి నాగేశ్వరరావు ధరావత్ కోటేశ్వరావు ఎస్కే ఫరీద్ తాలూరి నాగయ్య ఏనుటి శీను శాంతయ్య ప్రభాకర్ చాందు జానీ తదితరులు పాల్గొ నారు

## ప్రభుత్వం అంచనాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**కామేపల్లి,సెప్టెంబర్1 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో ఘనంగా సత్కరించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ పదవి ద్వారా కనకయ్య మరింత సమర్థవంతంగా ప్రజల సమస్యలపై సేవలు చేసే మంచి గుణమున్న నాయకుడు అని వారు అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి ఎమ్మెల్యే కనకయ్య అని విధాల సంక్షేమ పథకాలకు బాటలు వేయాలని ప్రజలకు మేలు జరిగే విధంగా అందించాలని వారు ఆకాంక్షించారు

## మంచినీటి ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు



**కామేపల్లి సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** పరిశుభ్రతే ధ్యేయంగా గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను వేగవంతం చేసినట్లు ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ తెలిపారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకుల వద్ద, ప్రధాన రహదారులకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను తొలగించేందుకు మంగళవారం గడ్డి మందు పిచికారీ చేయించారు.?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మంచినీటి వనరుల వద్ద ఈగలు, దోమల వ్యాప్తిని అరికట్టేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచుతామని, ప్రజలు కూడా పరిశుభ్రత పాటించాలని ఆమె కోరారు.

## నిరంతర అభివృద్ధితో గ్రామ సీమల పురోభివృద్ధి

**- కెప్టెన్ బంజారాలో అభివృద్ధి పనులకు శ్రీకారం**
**- పారిశుధ్య నిర్వహణ,డ్రైనేజీ పనులను ప్రారంభించిన**
**- గ్రామ సర్పంచ్ అరెం అచ్చమ్మ**



**కామేపల్లి,సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** నిరంత అభివృద్ధితోనే గ్రామ సీమలు పురోభివృద్ధి చెందుతాయని కెప్టెన్ బంజారా గ్రామ సర్పంచ్ అరెం అచ్చమ్మ వెల్లడించారు. మంగళవారం మండలంలోని కెప్టెన్ బంజారా గ్రామ పంచాయతీలో డ్రైనేజ్,ఇంకుడు గుంటల నిర్మాణం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం పనులను భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.పరిసరాల పరిశుభ్రత తోనే ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమలాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అరెశీ రవి, పీఆర్ ఏఈ కేశవ్ , ఏపీవో శ్రీ రాణి, పంచాయతీ కార్యదర్శి రామ్‌లాల్,టీఏ భాస్కర్, పంచాయతీ సిబ్బందితో పాటు స్థానిక గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీస్తాయి

**-- గోవింద్రాల హైస్కూల్ లో ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు**





**కామేపల్లి,సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):** క్రీడలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలిగి తీస్తాయని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సోమలాల్ మండల విద్యా శాఖ అధికారి జి వెంకట్ సర్పంచ్ కమల వెల్లడించారు. మంగళవారం మండలంలోని గోవింద్రాల హైస్కూల్లో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. వివిధ పాఠశాల నుండి వచ్చిన విద్యార్థులను పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల వల్ల విద్యార్థుల శారీరక దేహ దారుఢ్యానికి, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పుస్తకాలు చదవడంతో పాటు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోవింద్రాల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బి. నాగేశ్వరరావు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లింగనాయక్,మాజీ ఎంపీటీసీ సునీత లక్ష్మీనారాయణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు), ఉపాధ్యాయ బృందం,పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ ఎం ఎస్ సి) సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- కామేపల్లి పీహెచ్‌సీ,గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ**





**కామేపల్లి,సెప్టెంబర్1 (భద్రాద్రి న్యూస్):** గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామారావు ఆదేశించారు. మంగళవారం ఆయన ఆకస్మికంగా కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణాన్ని,రోగుల చికిత్సా విభాగాలను పరిశీలించి వైద్యులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.?రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు.వారితో సంభాషించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అత్యవసర మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం ?ఆరోగ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పసిపిల్లలకు సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు.?అనంతరం కామేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్న సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.?హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత మహిళలను వేధిస్తున్న గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణకు 9 నుండి 14 ఏళ్ల వయస్సు గల బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ఎంతో అవసరమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి,సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు,పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి

**- కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్**
**- కొత్తలింగాల క్రాస్ రోడ్ లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ**



**కామేపల్లి,సెప్టెంబర్1 (భద్రాద్రి న్యూస్):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉద్దేశపూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తలింగాల క్రాస్ రోడ్ ఎస్సీ కాలనీ నుండి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ?ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు విశేష జనాదరణ పొందుతున్న రాహుల్ గాంధీపై కావాలనే బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు బనాయిస్తుందని ఆరోపించారు.ఉత్తరాఖండ్‌లో గొడవలకు కారణమైన బీజేపీ కార్యకర్తలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.?ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ మండల నాయకులు యడ్లపల్లి బాబు,ఎ. శివ,పి.కాటయ్య,టి. తిరుపతయ్యలతో పాటు భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046